# "తడిసి తడిసి మోపెడాయె"

"నీ యవ్వ! గీ గవిరిమెంటోల్లకు ఓట్లప్పుడే మా అసొంటోల్లు కనిపిత్తరు. ఓట్లత్తన్నయంటె లీడర్లంత మా ముడ్డిసుట్టు తిరుగుతరు, కల్లు దాగిప్తిరు, ఓటల్లల్ల తినిపిత్తరు, ఇన్నన్ని పైసలిత్తరు, పన్నులు మాపంటరు, బేంకుల్ల దీసుకున్న పైసలు గట్టకుంటె మానాయెనంటరు. గిట్ల అరొక్క తీరుగ సెప్పుకుంట అరిసేతుల వైకుంటం సూపిత్తరు. అటుజేసిటుజేసి ఓట్లు దొబ్బిపోతరు. ఓట్లయిపోయినంక సెంగోబిల్లన్నరంటిగమల్ల ఓట్లప్పుడే యాదికత్తరోటేసినోల్లు. గీ కట్టెకోత కులమోల్లను నమ్మద్దు. గీ అగ్గెనగండ్లెగా బాకెట్ల గట్టాలె! నడిగండ్ల బొండిగ్గియ్యవట్టిరి. సత్తామంటె సావన్న రాదు. బతికినన్ని రోజులిగ కట్టాల్లప్పయి. సత్తెనన్న సుకపడుదునేమో?" బజార్లకెల్లి బస్టాండు మొకాన పొయ్యేటోన్ని గడడం మొండయ్య మాటలిని ఆగిన.

"ఏందే మొండన్నేందో బాగ లొల్లి జేత్తన్నవు? ఎవ్వలమీన్నే కోపం?" అనుకుంట పొయ్యి దగ్గెర నిల్సున్న

"ఎవ్వలమీనికి లొల్లివెడితెవ్వలూకుంటరె? నా రోత బతుకుమీన లొల్లి వెట్టుకుంటన్న. ఇయేడు సరిగ్గ వానల్లేక పునాసపంట నాశినమైపోయిందా! గా వడ్లిత్తులన్నా పండుతయనుకుంటె నీల్లందక గవ్వి గూడ బరుకతి లేకుంటాయెనా! నిరుడేమో మత్తడిదెగి పొలంల ఉసికెవెవెట్టెనా? ఇగ కోలుకునెదెట్లనే? గప్పట్లనేమో సిన్నసిన్నెవుసదార్లు బాకీలు గట్టమంటె మానాయెగని మంత్రి జెప్ప. మల్ల గిప్పడేమో బేంకులల్ల గట్టకుంటె బూమి జప్తు సేత్తరంట. గిట్లుంది కత" అన్నడు మొండయ్య.

"దేనికోసురం తీసుకున్నవు గీ బాకి.......?"

"బాయిల అమిది తీసుటానికి తీసుకున్న. గి దీన్ని గీ కరువుల గట్టుమంటెట్ల సెప్పు? గీ సరుకారోల్లగ్గూడ గురి, మరియాద లేకుంటయిపెయింది. నిల్సున్నోన్ని నిల్సున్నట్టే దోసెటట్టున్నరు. మా ఎద్దుముడ్డి పొడుసుక బతికెటోల్ల కట్టాలు మీకేమెరుక? మీరేమొ మంచిగ నౌకర్లు జేసుకుంట బతుకపడ్తిరి. అట్ల గూసోలేవు" అక్కడున్న మంచం సూపెట్టిండు మొండయ్య. నేనా మంచంల కూసున్న. మొండయ్య నా పక్కపొంట కూసున్నడు.

"ఎవ్వలకున్న బాదలాల్లకున్నయే మొండన్న! నౌకరి జేసెటోల్ల బాదలు నౌకరిజేసేటోల్లకున్నయి. ఎంత నౌకరి జేసెటోడైనా ఎవుసదారుని కిందనే!" అన్న నేను.

"గట్టెందుకంటవు పెద్ద పెద్ద మాటల్తోని. మంత్రుల కాన్నుంచంత ఎవుసం జేసెటోడె గొప్పోడు, రైతే రాజని గాలి నింపుడయితె నింపిరి గని ఎవుసంమీదాధారపడి నోనింట్ల సెప్పేత్తె కుండ దాకనే పాయె. ఒక్క చెపరాశి నౌకర్జేసెటోడు తిన్న బువ్వ ఎవుసం జేసెటోడు తింటడా? మల్ల! దొడ్డుబట్టలు గట్టుకోనుండే మోటు ఎవుసవారుడంటె అందరికి సిన్నసూపెనాయె. బస్సులల్ల గూడ సులుకన జేసిరి. బస్సుల్ల మేం చుట్ట దాగుతె తప్పాయె. సదువుకున్నోల్లు సిగిరెట్టు దాగుతేం లేపాయె.....!

సరుకారోల్లేమో గుండెలమీన కూసుండి బాకీలు వసూల్జేసుకపెయిరి. రోత బతుకయిపెయిందే మాది" విచారంగన్నడు మొండయ్య.

"ఊల్లె బాకీలిడిసిపెట్టి సరుకారు బాకీలకెగవడ్డవా ఏంది?"

"బాకిత్తనన్నంక తీసుకోని కాపాడెవ్వడున్నడో నాక్కొద్దిగ జెప్పు! బాకీల్జెయ్యందెవ్వలకెల్లది. యాల్లకు పెట్టువడులకు పైసల్దొరుకయి. ఇగ ఆనికాల్లు, ఈనికాల్లు పట్టుకోవాలె. లేకుంటె బూమిలేసిన పంట దెబ్బదింటది. ఊల్లె సావుకారి దగ్గెర బాగ మిత్తుంటదని, సరుకారు దగ్గెర్నయితె కొంచెమంత తక్కో మిత్తికి[49] దొరుకుద్దని తీసుకునుడు మొదలువెట్టిన" అన్నడు మొండయ్య.

"అయితేంది? సరుకారి మిత్తెట్లయిన తక్కోనే కద......"

"మీదికి తక్కోనే ఉన్నట్టు కనిపిత్తది కని అందరికిచ్చుకుంటచ్చెవారకు మల్ల గంతేబలుత్తది. ఊళ్ళె పటువారిక్కొంత ముట్టజెప్పన్నా! పైరవికారికింతియ్యాల్నాయె! సంతుకానికి గిరుదవార్రికియ్యన్నాయె. రాసెటోనికి-పూసెటోనికి కందరికిచ్చుకుంట పొయ్యేవారకు గంతే మిత్తి వడుతది. మల్ల ఇత్తమన్న యాల్లకొక్కరోజు దాటినా గని జరుమానేసిరి. అరబ్బులోం తీరుగనే నిల్సుండి ఏదుంటది అమ్ముకోనయినా గని వసూల్జేసుకపెయిరి. నాగటిమీనెడ్ల నర్రాజు పాడిన సంగతులు గూడున్నయి. జీ పేసుకొని వసూలుకత్తె జీబులాయిలుకు, వచ్చినోనికి బత్తగిట్టన్ని మాదగ్గెర్నే గుంజిరి. ఎండ ఎలుమోదువాన తురుకోడందురెనుకట. ఎండకన్న కొద్దిగంత సేపుండచ్చుకని అనకు నిలవడత్తదా? కొమటయినె బాకి ఎలుమోనసోంటిదయితె సరుకారి బాకి తురుకోనసోంటిది".

"మరి గీ అప్పుల్జేసుడెందుకే మొండన్న" పంటో తీరగ పండనేవట్టె. ఆడికాడికన్ని ఎల్లదీసుకుంటయిపాయేంది?"

ఇగ నీకు తెల్సింది గంత మేమేమన్న తినుటానికి తాగుటానికి బాకీల్జేత్తమనుకుంటున్నవా? ఎల్లకనే సేసుడయితంది. పంటపండనేడు పండదా? పండుతేం లాబముందే? ఆటికి దరుండది. మంచిగ పండిన పంటకు దర పడిపోతది. పండనిదానికి దరుంటది. గదానికి దరున్నదని గదేసి పండిత్తె మల్లో ఏడువారకు దానిదర పడిపోద్ది బీట్లెకు పోతె మచ్చులు సూసెటోడు, అమాలోని[50] కాన్నుంచందరు దోసుడేనాయె. పంటమొకమన్న సూడనోడు దానికి దర గట్టె. ఇగ గిట్లుంది మా ఎవుసదార్ల సంగతి. మల్ల మేం గొసేటియేమో అగ్గోలె మండె. యూరియ బస్తలకు, ఇంక మందులకు గిట్టవశెం గాని దరలాయె. మా అసోంటోల్లేడ బతుకచ్చెటట్టుందా? గందుకని ఎన్నెవుసాలు మూలవడ్డయి? రిక్ష దొక్కిన మంచిదే కని గీ ఎవుసమద్దని సానమంది ఎవుసాలిడ్సిపెట్టి పోవట్రె' మొండయ్య మొకంలేదో బాద.

"సరుకారోల్లు మీరు పండిచ్చిన పంటకు మంచి దర నిత్తమంటంద్రు. మా ఇత్తరిగ. ఏకరొందుకు తియ్యి.

"గవ్వి ఉత్తుత్త మాటలే. ఏ సరుకారచ్చినా సెప్పుడయితె మస్తు సెప్పుతరు. ఓట్లయినంక మల్ల ఎప్పుటాటే. అయినా గనాల్లకు మా అసోంటోల్ల సంగతెందుకు సెప్పు? అల్లు బందవస్తుగనే ఉండిరి?"

"నువ్వన్నది నిజమే కని బాకీలేపాటున్నయి?" అన్న నేను.

"ఎల్లెంబిల, కో-ఆపరేటివ్ బాంకుల, స్టేట్ బేంకుల అన్నిట్ల గలిసి పదివేల్దీసుకున్న. కొమటయినె దగ్గిర్నో రొండువెయిలు, కని అన్నిటికి మిత్తి, మిత్తికి మిత్తి అన్ని గల్సి తడిసితడిసి మోపెడయితంది.

మిత్తితో నిరువై వేలకచ్చె. బూమ్మమ్మి గడుదామంటె మనుసొప్పతలేదు. పొల్లగాండ్లెదుగుతంద్రు. అల్లకు గా బాకీలే పంచిచ్చుడాయెతట్టుంది. నా కడుపుల పుట్టినందుకు గదే గతాయెటట్టుంది' ఆవేదనతోనన్న మొండయ్య కనుకొలుకులల్ల నీల్లు గనవడ్డయి నాకు.

మొండయ్య మాటలెప్పుడు యాదికత్తనే ఉంటయి నాకు. కిందికే అవుతున్న ఎవుసాలు ఊళ్ళిడిసి పొట్ట చేతులవట్టుకోని పోతున్నవాళ్ళు కనవడ్తరు నాకు. ఇవ్వన్నిటికి గల కారణాలు బోదపడ్తన్నట్టే ఉన్నయి నాకు. మరి వాటికి పరిష్కారం..........?

☆ ☆ ☆